ఎప్పుడూ కలగని చిరాకు యీనాడు శాంతమీద కలిగింది.

శాంత అతనిదగ్గర కూర్చొని నెమ్మదిగా "ఏమండి పెళ్ళి క్రిందటి నెల పదహారో తారీఖున అయిపోయిందండీ. శుభలేఖ నెలరోజులు ఆలస్యంగా వచ్చింది" అని అన్నది.

రామచంద్రయ్యగారు ఏం మాట్లాడలేదు. శాంతవంక చూశాడు. ఏదో చెబుదామనుకున్నాడు. ఏదో మాట్లాడుదామనుకున్నాడు. మళ్ళీ అంతలోనే తెప్పరిల్లుకుని,

"అమ్మాయి కాపురానికి కూడా వెళ్ళిపోయి వుంటుంది కదా?" అని అన్నాడు.

"వెళ్ళిపోయి వుంటుంది" అంటూ శాంత లోపలికి వెళ్ళిపోయింది.

రామచంద్రయ్యగారు ఆ శుభలేఖ వంక మళ్ళీ మళ్ళీ చూచుకున్నాడు. ఈ సారి పూర్తిగా చదివాడు.

క్షణకాలం పోష్టలు డిపార్టుమెంటు మీద కోపం వచ్చింది. కాని ఆ ఉత్తరం క్రిందటిరోజునే డబ్బాలో పడ్డట్టు ముద్రచెబుతోంది.

అంటే?

అన్నయ్య కావాలనే యిల్లా చేశాడా?

ఇరవై సంవత్సరాలు గడిచిపోయినా కక్షలు మరిచిపోలేదా ! ఏమో అన్నయ్య ఇల్లా చేశాడంటే నమ్మకం కుదరటంలేదు !! అన్నయ్య అల్లాంటి మనిషి కాదు.

ఏమో ? ఏమో!

ఎండిపోయిన చెట్టుమీద కాకి అరుస్తూనే వుంది.

శిధిలమైన యింట్లోకీ సూర్యచంద్రులు తొంగిచూస్తున్నారు.

బీడువారిన చౌడు పొలం తనని చూసి నవ్వుతోంది.

చిరిగిపోయిన గాలిపటం చెట్టుకొమ్మన విలవిల్లాడుతోంది.

ఎన్నడూ చిన్నబోవని హృదయం యీనాడు చిరుగుపట్టింది.

(ఆకాశవాణి మదరాసు కేంద్రం సౌజన్యంతో)

# క్షమయాధరిత్రీ !!

"తమ కోసరం ఎవరో ముసలాయన వచ్చారు" అని నా దగ్గర పనిచేసే కుర్రవాడు అన్నాడు.

"లోపలకు రమ్మని చెప్పు"

ఆయన లోపలకు వచ్చాడు, నాకోసం రోజూ అనేకమంది అనేక రకాల పనులమీద వస్తారు. ఈ ముసలాయన కూడా ఆ రకమేనని అపోహ పడ్డాను.

ఆయన్ను చూడగానే ఉలిక్కిపడ్డాను.

నన్నుచూసి ఒగున చిరునవ్వు నవ్వి "ఇంకా గుర్తున్నానా?" అని అడిగారు.

ఎంతమాట. మిమ్మల్ని మరిచిపోవటమా? ఇదంతా మీ చలవేగా.

"గుమ్మం బయట కూర్చున్న బంట్రోతు కుర్రవాడు నా మనస్సు గ్రహించాడో ఏమో?"

ట్రేలో కాఫీ బిస్కట్లు తీసుకుని వచ్చాడు.

"కూర్చోండి నిలబడే వున్నారు."

ఆయన ముఖంలో సంతృప్తి కనిపించింది. కుర్చీలో కూర్చున్నారు. ఇల్లంతా ఒకసారి కలయజూచాడు.

"పిల్లలు వాళ్ళు ఏరి?" అని ఆయన అడిగాడు.

"ఇంకా పెళ్ళి కాలేదు."

"ఎందుకని"

"నాకు పిల్ల నెవరిస్తారు."

"అదేం మాట రామం నీకేం లోపమని !"

"కులం లేనివాడిని గుణం లేని వాడిని."

రామచంద్రయ్యగారు నా వంక చూడకుండా గోడ మీద వున్న వెంకటేశ్వరస్వామి పటం వంక చూస్తున్నారు. ఆయన ముఖంలో దుఃఖం, బాధ కనిపించాయి.

"ఐ యాం సారి" అని అన్నాను.

"వెడతాను రామం" అంటూ ఆయన లేచారు.

నేను కలలో నుంచి తెప్పరిల్లుతున్నవాడిలాగా ఒక్కసారి కలవర పడ్డాను.

"కూర్చోండి. మీ మనస్సు కష్టపెట్టాను. క్షమించండి" అని అన్నాను.

ఆయన కూర్చుంటూ"We are fools"అని అన్నాడు.

"Yes" అని నేను అన్నాను.

"కాఫీ పుచ్చుకోండి" అని ఆయన్ని ప్రార్థించాను.

కాఫీ త్రాగిఆయన కొద్ది క్షణాలు ఏం మాట్లాడలేదు.

ఆయన వైఖరి చూస్తుంటే ఏదో చెప్పడానిక సందేహిస్తున్నట్లుగా కనిపిస్తున్నారు. నేనే ధైర్యం చేసి

"ఏదో పనిమీద వచ్చినట్లున్నారు" అని అన్నాను.

"పనిమీదేవచ్చాను రామం"

..... "కాని నీతో ఎల్లా చెప్పాలో తెలియడం లేదు ... ఏమనుకుంటావో?"

"చూడండి. రామచంద్రయ్యగారూ ! మనుషుల జీవితాలు వాళ్ల వాళ్ల పూర్వజన్మ పాప పుణ్యాల మీద ఆధారపడి వుంటాయని నేను నమ్ముతాను ఒక మనిషి ఇంకొక మనిషికి అపకారం చెయ్యగలడని అనుకోను"

"అంత మనశ్శాంతి మనోధైర్యం నాకు లేవు రామం!"

నేను నవ్వాను. ఆయన ముఖములో రవ్వంత నవ్వు కనిపించింది.

"రామం ! శ్యామలా వాళ్ళు యిక్కడే వున్నారు."

నేనేం మాట్లాడలేదు.

"ఒకసారి వచ్చి వాళ్ళని చూసి వెళ్ళు."

నేను యీసారికూడా ఏం మాట్లాడలేదు.

"శ్యామలకు ఐదుగురు పిల్లలు."

నేను ఒక్కసారి ఆయన వంక చూసాను.

"రామం ! తరచూ నీ విషయం ఇంట్లో అనుకుంటూ వుంటాం"

"Thank You"

"నువ్వంటే యీ యింట్లో అందరికి చాలా అభిమానం. నువ్వు మా యింట్లో ఒక మనిషివనే మేము ఎప్పుడూ అనుకుంటాం."

"Thank You"

"శ్యామలే అన్నది. నువ్వడిగితే రామం కాదని అనడు నాన్నా ఒక్కసారి అతనితో మాట్లాడు. అని అన్నది."

"చెప్పండి."

"మా అల్లుడు ఇవ్వాళ నీ దగ్గరకు ఇంటర్వ్యూకు వచ్చాడు."

'నేను చిరునవ్వు నవ్వాను.'

"నీకు తెలుసు నన్నమాట" అని ఆయన అన్నాడు.

"నాకు తెలియదు" అని సమాధానం చెప్పాను.

"నీకు పరసనల్ అసిస్టెంటు కావాలని ఇంటర్వ్యూకు పిలిచన వాళ్ళలో అతనూ వున్నాడు రామం !"

ఈ రోజు ఇంటర్వ్యూకు చాలామంది వచ్చారు.

"చూడు రామం ! అతనికి యీ ఉద్యోగం, కాదు శ్యామలకు యీ ఉద్యోగం చాలా అవుసరం !"

"ఆర్థికమైనా ఇబ్బందా?"

"అవును రామం."

"వాళ్ళు జమిందారులేమో?"

"అనే నేనూ అనుకున్నాను. ఆ ఆస్తులు లేవుకాని, ఆ ఖర్చులు మాత్రం వున్నాయి,

"మీ వెంట వచ్చాడా?"

"వచ్చాడు రామం! అంటూ ఆయన బయటకు వెళ్ళి అతనితో తిరిగి వచ్చాడు'

అతన్ని చూడగానే నేను వెంటనే గుర్తుపట్టాను. ఇంటర్వ్యూ జరుగుతున్నంతసేపూ, ఉద్యోగం వచ్చినా రాకపోయినా ఫరవాలేదన్న ధీమాతో వున్న మనిషి అతనొక్కడే.

"కూర్చోండి" అన్నాను.

నాతో ఏదైనా పని వున్నవాళ్ళు నన్ను చూడగానే నమస్కరించడమో, గుడ్‌మార్నింగ్ వగైరా అనటమో ఏదో సాధారణంగా జరుగుతుంది. కాని అతనటువంటి పనేం చెయ్యలేదు.

"నా దగ్గర పనిచెయ్యటం చాలా కష్టం. అనేక రకాల బాధ్యతలని బాధలని, తట్టుకోగలిగిన వాడే ఇక్కడ వుండగలడు. కష్టానికి భయపడని వాడే ఇక్కడ సుఖపడగలడు. ఆ ధైర్యం మీకుందా?"

"ధైర్యానికిగాని, అధైర్యానికి గాని ఇది నా మొట్ట మొదటి ఉద్యోగం. మీరు నాకు దారి చూపితేనే నెటువంటి పనైనా చెయ్యగలను."

"తెలియనివాడికి నేర్పడానికి నేనెప్పుడైనా సిద్ధమే. తెలియక పోయినా తెలిసినట్టు

నటించేవారు మాత్రం ఇక్కడ ఒక్క క్షణం వుండలేరు."

"మీకా భయం అక్కర్లేదు, నాకేం తెలియదు."

నేను చిరునవ్వు నవ్వాను.

"ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోండి. ఇది చాలా బాధ్యతతో గూడిన ఉద్యోగం. ఎంతో అనుభవం వున్నవారికి గాని ఇటువంటి పని సాధారణంగా ఇవ్వటం జరగదు"

"నాకు తెలుసు."

"మిమ్మల్ని తీసుకోవడంలో నేనొక risk తీసుకుంటున్నాను."

"మీ కేం భయం అక్కర్లేదు."

"ఇంకొక విషయం ముందుగానే మీరు గ్రహించటం మంచిది. ఇంతకాలం యితరులచేత సేవలు చేయించు కోవడానిక అలవాటు పడ్డ మీరు, అకస్మాత్తుగా ఇతరులకి సేవచేయాలంటే కష్టం, బాధ కలగవచ్చు."

"మీలాంటి మంచి వారి దగ్గర నాకటువంటి భయం వుండదు లేండి"

"ఎందుకని?"

"మీలాంటి సహృదయులు ఇతరులని సరిగ్గా అర్థం చేసుకోగల్గుతారు. Thank You మంచి రోజు చూసి డ్యూటీలో జాయిను అవ్వండి." అతను చేతులు జోడించి నమస్కారం చేశాడు.

"వెళ్ళివస్తాం" అంటూ యిద్దరూ లేచారు.

"మంచిది" అని అన్నాను.

అతను బయటకు వెళ్లి పోయాడు. రామచంద్రయ్యగారు గుమ్మందాకా వెళ్ళి మళ్లీ బల్లదగ్గరకు వచ్చాడు.

'నిన్ను గురించి నేను రెండుసార్లు పొరబడ్డాను రామం. నా బిడ్డ సుఖం కోసం చేస్తున్నాని అనుకున్నాను. కాని అన్ని విధాల పొరబాటు పనులే చాశాను. నేనూ చేశాను- మీరూ చేశారు"

"మేం చేశామా?"

" ఆనాడే ధైర్యంచేసి మీ యిద్దరూ ఏ రిజిష్టరు మ్యారేజో చేసుకునివుంటే నాలుగు రోజులు గొడవపడ్డాం కాలమే అన్నీ తీర్చిదిద్దేది."

"నిజమే."

"ప్రతి ఆడపిల్ల తండ్రిలోనూ నన్ను చూడటం మానేయి రామం. కొందరు నిన్ను అపార్థం చేసుకుంటే, మరికొందరు నిన్ను సరిగ్గా అర్థం చేసుకుంటారు. వాళ్లను నీ దగ్గరకు చేర్చుకో. నిన్ను ప్రేమించే వాళ్ళను గుర్తించడం నేర్చుకో" అంటూ ఆయన లేచారు.

ఆయన వెళ్ళిపోయాడు. వేంకటేశ్వరస్వామి పటం వంక చూశాను. ఉల్లాసం కలిగింది. మనస్సు మల్లెకన్నా తేలిక అయింది.

రామచంద్రయ్యగారు అన్న మాట మనస్సులో మసలింది. "నిన్ను ప్రేమించేవారిని గుర్తించడం నేర్చుకో"

మనస్సులో అనేక వేల ఆలోచనలు పరుగెత్తినాయి. పన్నెండు సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన మనస్సులో మసలింది.

మా యింటి ముందు ఒక లారి ఆగి వుంది. దాన్నిండ సామానులున్నాయి. ముందు సీటులో శ్యామల కూర్చుని వుంది. ఏడ్చి ఏడ్చి వుందేమో కళ్ళు ఎర్రబడి వున్నాయి. లారి ఎక్కబోతూ రామచంద్రయ్యగారు ఒక్కమాట అన్నారు.

"నీకు డబ్బువుంది రామం. కాని గుణం లేదు, కులం లేదు నీ డబ్బుని చూసి శ్యామలని నీ పాదాలమీద పారేస్తానని అనుకున్నావు. అది కల్లోని వార్త."

లారీ అమిత వేగంగా వెళ్ళిపోయింది.

కులం గుణం లేనివాడు డబ్బు యిస్తే తీసుకోవచ్చు. ఊరికే యిల్లు యిస్తే ఇంట్లో వుండవచ్చు. అతని అండదండలతో జీవిత సోపానం మీద ఎన్నో మెట్లు ఎక్కవచ్చు.

అతన్ని చూసి ఏ ఆడకూతురైనా మనసిస్తే ఆ చిన్న దాన్ని నిలువునా జీవసమాధి చెయ్యాలని ఎగబడటమే.

అందుకనే కాబోలు ఈ కులం గుణంలేనివాడిని ప్రేమించానని తన కూతురు చెప్పగానే రామచంద్రయ్యగారు ఉగ్ర నరసింహావతారం ఎత్తింది.

తన సర్వస్వం అప్పులపాలై నిలువ నీడలేక రోడ్డుమీద కూడా నుంచోడానికి ఆస్కారం లేని ఆనాడు, కులం, గుణం వున్న వాళ్ళెవ్వరూ ఆయనకు ఆసరా యివ్వలేదేం?

తనకు డబ్బు యిబ్బంది కలిగిన రోజున, అప్పు తీసుకురమ్మని కూతురిని పంపిన రోజున కులం గుణం వున్న వాళ్ళెవరూ ఆదుకోలేదేం?

భోగం కులంలో పుట్టిన కన్యను మా నాన్న వివాహమాడాడుట, ఆవిడ పతిత కాకుండా ఆయన ఉద్ధరిస్తే, ఆయన భ్రష్టుడు కాకుండా ఆవిడ కాపాడింది. వాళ్ళు జీవించినంతకాలం అందరికంటెనూ నిష్టగానే బ్రతికారు.

వాళ్ళ కడుపున పుట్టడం పాపమని నేను అనుకోను. ఇటువంటి దుర్మార్గపు సమాజంలో పుట్టడమే పాపమని నేననుకుంటున్నాను.

అందుకనే కాబోలు అందరిలో నేను ఏకాకిని. ఈనాడు నా వయస్సు ముప్ఫై రెండు సంవత్సరాలు. పెద్ద చదువు. నెలకు పద్దెనిమిది వందల రూపాయల ఉద్యోగం, అందరికి నాతో పని ఉంటుంది.

కాని నేను ఎవ్వరికీ ఏమీకాను, అదే విచిత్రం. అదే వైపరీత్యం !

"రామ్!" అని ఒక తియ్యటి కంఠం మెల్లిగా పలికింది. నేను ఉలిక్కిపడ్డాను.

"గుర్తుపట్టావా ?"

నాకు తెలిసిన వ్యక్తిని గుర్తుపట్టడం కోసం ప్రయత్నం చేశాను. మిగిలినదల్లా ఆ తియ్యటి కంఠమొక్కటె, ఆ అందచందాలు ఆ సోయగం, ఆ హొయలు అవన్నీ ఆనాటి మాటలు.

"గుర్తుపట్టావా? నీ క్రొత్త నౌకరు భార్యని."

"కూర్చో శ్యామలా !"

"నేను కూర్చోడానికి రాలేదు."

"పన్నెండు సంవత్సరాల తరువాత ...

అసలు నిన్ను మళ్ళీ ఎన్నడూ చూడకూడదనుకున్నా, ధైర్యం లేని వాడిని ప్రేమించానని ఎంతో బాధపడ్డాను. జన్మలో నీముఖం చూడకూడదని అనుకున్నాను.'

"అనుకున్న పనులు అన్నీ జరగవు శ్యామలా?"

"ఒక్కమాట చెప్పిపోదామని వచ్చాను. రామం, ఉద్యోగం నీదగ్గరని, నాకు తెలియదు. వాళ్ళని నీదగ్గరకు వెళ్ళమని చెప్పింది నేను కాదు."

"పరవాలేదు శ్యామలా."

"నీకు ఫరవాలేకపోవచ్చు రామం. నీకు అపకారం చేసిన వాళ్ళకి గొప్ప ఉపకారం చేశాననే సంతృప్తి, గర్వం, నీకు కలగడానికి వీలులేదు."

"నేను అల్లా అనుకోవడం లేదు."

"నేను అనుక్షణం గౌరవించి ప్రేమించే వ్యక్తి నేను ద్వేషించే మనిషికి నౌకరుగా వుండటం నేను సహించలేను."

"అతను నా నౌకరుగా కాదు శ్యామలా. నా పరసనల్ అసిస్టెంటు."

"జీతం ఎక్కువ కావచ్చు కాని పని అదేగా?"

"నీకు ఎల్లా చెప్పాలో తెలియటం లేదు శ్యామలా!"

"పెళ్ళిచేసుకోవడం మానేశావుట ఎందుకని?"

"..............."

"ఒక ఆడదానివల్ల మోసపోయాడని అందరూ నీమీద జాలి పడతారని నిన్ను మోసం చేసినందుకు నన్ను ద్వేషించాలని యీ నాటకమా?"

"ఏం మాటలు శ్యామలా అవి?"

"మా ఆయనకు ఉద్యోగం యిచ్చి మా అందరిని నీ బానిసలు చేసుకోవడానికి యీ పన్నాగమా?"

నేను పెద్ద పెట్టున నవ్వాను.

"ఎందుకా నవ్వు?"

"మిమ్మల్ని చూస్తూంటే నవ్వు కాక ఏ మొస్తుందో చెప్పు."

"ఎందుకని?"

"ఉపకారం అర్థించి వచ్చింది మీరు"

"దీంట్లో ఉపకారం ఏముంది?"

"నీకు అర్థం కాదులే, వెళ్ళు శ్యామలా వెళ్లు. మళ్లి ఎప్పుడూ యిటురావడానికి ప్రయత్నం చేయవద్దు"

"రామం !"

"మనిషి మంచితనానికి ఒక మితం వుంది. సహనానికి ఒక హద్దు వుంది. కావాలని నరకం ఎవ్వరూ కోరుకోరు. నేను అంతే"

"రామం !"

"వెళ్ళు శ్యామలా. మీ ఆయనకు ఆ ఉద్యోగం యివ్వటం లేదని మీ ఆయనతో చెప్పు."

నేనిహ అక్కడ నిలవలేదు. సరాసరి 'జీపు' తీసుకొని బయలుదేరాను. అలవికాని వేగంతో రోడ్డుమీదకు వచ్చింది. బజారు దాటి, పార్కుదాటి, ఒక చక్కటి యింటిముందు నుంచి పోతూ సడన్ బ్రేకు వేసుకుని ఆగింది. కారు హారన్ మ్రోగింది. ఒక కిటికి రెక్క తెరుచుకుంది.

'ఎవరు?' అని ఒక కమ్మటి కంఠం పలుకరించింది.

'జానకి' అని నేను పిలిచాను.

'మీరా!' అంటూ తలుపు తెరుచుకుని రెండంగల్లో నాకారు దగ్గరకు వచ్చింది.

"ఇప్పుడు వచ్చారేం సార్ ఏమన్నా అర్జెంటు పేపర్లు టైపు చేసి పెట్టాలా?" అని మా టైపిస్టు జానకి అడిగింది.

'నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడదామని వచ్చాను."

జానకి ఒక్క క్షణం తటపటాయించింది.

"ఇంట్లో ఎవ్వరూ లేరు" అని అంది.

"పోనీ ఇక్కడే మాట్లాడుకుందాం చెప్పండి."

"నువ్వు మా ఆఫీసులో పనిచేస్తున్న ఈ రెండు సంవత్సరాలుగా ఒక్క విషయం చెబుదామని ఎప్పటికప్పుడు అనుకుంటున్నాను, కాని"

"కాని ..."

"చెబితే నువ్వేమనుకుంటావో అని సందేహించాను."

"ఫరవాలేదు చెప్పండి."

"నన్ను వివాహం చేసుకోమని ప్రార్థిస్తున్నాను."

జానకి నవ్వింది. ఆ నవ్వులో సెల ఏటి గలగల వుంది. కోయిల పాట వుంది. చక్కని చిలుకపలుకుంది.

కాని నాకు ఆ నవ్వు భయం కలిగించింది.

"క్షమించండి ఇంతకాలం మీతో చెప్పనందుకు. నాకు వివాహం అయింది. ఒక మగపిల్లవాడు కూడా వున్నాడు"

"మరి నాతో ..."

"పెళ్ళైందని తెలిస్తే యీ ఉద్యోగం యివ్వరని భయపడ్డాను. అందుకని పెళ్ళికాలేదని చెప్పాను"

ఈసారి నవ్వడం నా వంతు, కారు బయలుదేరే ముందర జానకితో ఒకే ఒక మాట అన్నాను.

"రేపటి నుంచి ఆఫీసుకు రావద్దు. నిన్ను డిస్మిస్ చేశాను."